## క్లుప్తంగా

### సి.బెళగల్ ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ


శకుంతలకు అభినందనలు తెలుపుతున్న అధికారులు

సి.బెళగల్: మండల పరిషత్ అభివృద్ధి అధికారిణిగా (ఎంపీడీఓ) శకుంతల శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా సి.బెళగల్ ఎంపీడీఓ అనంతపురం జిల్లాకు వెళ్లారు. ఆయన స్థానంలో అనంతపురం జిల్లా నల్లచెరువు ఎంపీడీఓగా పనిచేస్తున్న శకుంతల సి.బెళగల్‌కు వచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సందీప్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ అధికారి శ్రీనివాసులు, ఉద్యోగులు మంజుల, పీఎస్ సునీల్‌రాణి తదితరులు ఆమెకు అభినందనలు తెలిపారు.

### కార్డుదారులకు ఉచితంగా రాగులు


రాగులను పంపిణీ చేస్తున్న డీటీ నవీన్‌కుమార్

కోడుమూరు రూరల్: రేషన్‌కార్డుదారులకు సక్రమంగా సరుకులు పంపిణీ చేయాలని సివిల్ సప్లైస్ డీటీ నవీన్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని కోడుమూరు, వర్కూరు గ్రామాల్లో రేషన్ పంపిణీని పరిశీలించారు. డీటీ మాట్లాడుతూ.. ప్రతి కార్డుదారుడికి బియ్యం, బ్యాళ్లు, చెక్కెరను అందజేయాలని, ఈ నెల అదనంగా రాగులను కూడా ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోందని తెలిపారు. కిలో బియ్యానికి బదులు కిలో రాగులను కార్డుదారులు పొందవచ్చన్నారు.

### ఉపాధి హామీతో గ్రామాల అభివృద్ధి


కేక్ కట్ చేస్తున్న ఎంపీడీఓ

సి.బెళగల్: జాతీయ ఉపాధిహామీ పథకంతో గ్రామాల్లో సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీడీఓ శకుంతల అన్నారు. ఉపాధి హామీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఏపీఓ లక్ష్మన్న, ఈఓఆర్డీ సందీప్, కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### ఎప్కాస్ సంస్థతోనే జీతాలు చెల్లించాలి


ఎయిర్‌పోర్ట్ వద్ద ఆందోళన చేస్తున్న సిబ్బంది

ఓర్వకల్లు: గతంలో మాదిరిగానే ఎప్కాస్ సంస్థ ద్వారానే తమకు జీతాలు చెల్లించాలని కింది స్థాయి ఎయిర్‌పోర్ట్ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక ఎయిర్ పోర్ట్ వద్ద ఆందోళనకు దిగారు. 7 నెలల నుంచి జీతభత్యాలు చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సాయి సంపత్ సంస్థ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఏపీఏడీసీఎల్ వారు తమ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఎప్కాస్ సంస్థ ద్వారానే జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

### తాగునీటి సౌకర్యం


మోటారు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

గడివేముల: మండల కేంద్రంలోని జగనన్న కాలనీలో తాగునీటి ఏర్పాటు చేశారు. శుక్రవారం కాలనీలో కొత్తగా వేసిన బోరుకు మోటారు ఏర్పాటు చేసి కాలనీ వాసులకు నీటిని సరఫరాకు సిద్ధం చేశారు. దీంతో కాలనీలో నూతనంగా ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖర రెడ్డి, ఉప సర్పంచ్ బాలచెన్ని, వైఎస్సార్‌సీపీ నాయకులు దేశం నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

### 9 నుంచి పల్లెకు పోదాం

కర్నూలు కల్చరల్: ఈనెల 9 నుంచి 11 వ తేదీ వరకు జిల్లాలో పల్లెకు పోదాం, 20 నుంచి 29వ తేదీ వరకు ప్రజా పోరు యాత్ర కార్యక్రమాలు చేపట్టనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగరూరు రాఘవేంద్ర తెలిపారు. ఆయా కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం నరసింహారెడ్డి నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్ర మంలో జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి కోటి,అధికార ప్రతినిధి రామాంజనేయులు పాల్గొన్నారు.

# త్రాసు..తిరకాసు

- తూకాల్లో భారీ మోసం
- వస్తువుల క్రయ, విక్రయాల్లో తూకాల వాటం
- ప్రమాణాలు గాలికొదిలేసిన కొందరు వ్యాపారులు
- పండ్లు, కూరగాయల విక్రయాల్లో మోసం

☛ నగరానికి చెందిన శ్రీనివాసులు స్థానిక మార్కెట్‌లో ఒక కిలో జామ, రెండు కిలోల ఆపిల్ పండ్లు కొనుగోలు చేశాడు. తీరా ఇంటికి వెళ్లి తూకం వేయగా, కిలో జామలో 200 గ్రాములు తక్కువ వచ్చింది. ఆపిల్‌లోనూ 160 గ్రాములు తేడా వచ్చింది.

☛ నగరానికి చెందిన మసూద్‌వలీ సీ క్యాంప్ రైతు బజార్‌లో ఒక కిలో టమాట, కిలో బెండకాయ కొనుగోలు చేశాడు. రాళ్ల కాటాతో తూకం వేయడంతో తూకం తక్కువగా వచ్చిందని డిజిటల్ కాటాలో తూకం వేయగా టమాట 220 గ్రాములు, బెండకాయ 180 గ్రాములు తేడా వచ్చింది.

☛ ఇవే కాదు నగరంలో పండ్లు, కూరగాయాల వినియోగదారులు నిత్యం మోసాలకు గురవుతూనే ఉన్నారు. అధికారులు తూతూ మంత్రంగా తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటుండటంతో వ్యాపారులది ఆడిందే ఆట పాడిందే పాటగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.


కేసీ కెనాల్ వద్ద పండ్లను విక్రయిస్తున్న వ్యాపారులు

కర్నూలు (న్యూటౌన్): పండ్లు, కూరగాయల విక్రయాల్లో వ్యాపారులు మోసాలకు పాల్పడుతున్నారు. ఒక వైపు కల్తీ.. మరోవైపు తూకాల్లో మోసాలతో వినియోగదారులు నష్టపోతున్నారు. కొందరు వ్యాపారులు కనీస ప్రమాణాలు కూడా పాటించడం లేదు.

**ప్రామాణిక ముద్ర ఏది?**

నిత్యావసరాలు, ఇతర ఆహార పదార్థాలు, పండ్ల తూకాల్లో మోసాల సంగతి చెప్పనకర్లేదు. కిలోకి 200 గ్రాముల వరకూ తగ్గించి విక్రయిస్తున్నారు. కొన్ని వస్తువులను ప్రామాణిక ముద్రతో విక్రయించాల్సి ఉన్నా అడిగేవారు లేరని ఇష్టానుసారంగా విక్రయిస్తున్నారు. వారపు సంతలు, మార్కెట్లు, రైతు బజార్లలో సైతం రాళ్లనే కొలతలుగా వినియోగిస్తున్నారు. స్వీట్ల దుకాణాల్లో వాటిపై తయారీ తేదీ ఉండాలనే నిబంధన ఉన్నా... ఎక్కడా ముద్రిస్తున్న దాఖలాలు లేవు.

**రోజుకు రూ.10 లక్షల వ్యాపారం**

ప్రతి రోజూ కర్నూలు నగరంలో పండ్ల వ్యాపారులు రూ.10 లక్షలకు పైగా వ్యాపార లావాదేవీలను కొనసాగిస్తున్నారు. పాతనగరంలోని ఫ్రూట్ మార్కెట్‌లో వివిధ రకాల పండ్లను చిరు వ్యాపారులకు విక్రయించడంతో సుమారు రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వ్యాపారం జరుగుతోంది.

**మోసాలకు పాల్పడుతున్నారు**



సీ క్యాంప్ రైతు బజార్‌లో కేజీ ఆలుగడ్డలు, కేజీ టమాట, కేజీ పచ్చిమిర్చి కొనుగోలు చేశాను. తూకం తక్కువ వచ్చినా ఎవరికి చెప్పాలో తెలియక ఊరకనే ఉన్నా. వ్యాపారులు రైతు బజార్‌లో మోసం చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేరు. ప్రతి వ్యాపారంలో మోసాలకు పాల్పడడం అలవాటుగా మారుపోయింది.

– వీరేష్, మాధవనగర్, కర్నూలు

**దాడులు ముమ్మరం చేస్తాం..**



కర్నూలు నగరంలోని వివిధ దుకాణాల్లో రెగ్యులర్‌గా కాటాలను తనిఖీ చేసి ముద్రలు వేస్తున్నాం. వ్యాపార సంస్థలన్నీ ప్రమాణాలు పాటించాలి. తూకాల్లో మోసాలపై సోదాలు ముమ్మరం చేస్తాం. ఎక్కడైనా మోసాలు జరిగినట్లుత ఫిర్యాదు చేస్తే చట్టపరంగా చర్యలు చేపడతాం.

– పరమేశ్వర్, తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్, కర్నూలు

### ఎంపీడీఓగా శివరామిరెడ్డి

గడివేముల: ఎంపీడీగా శివరామిరెడ్డిని జిల్లా ఉన్నతాధికారులు శుక్రవారం నియమించారు. సార్వత్రికల ఎన్నికలల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ శివమల్లేశ్వరప్పను అనంతపురం బదిలీ చేశారు. వైఎస్సార్ కడప జిల్లా చిట్వేలి మండలంలో పనిచేస్తున్న శివరామిరెడ్డిని ఇక్కడికి బదిలీ చేశారు.

**తహసీల్దార్‌గా ఫణికుమార్**

పాణ్యం: స్థానిక తహసీల్దార్‌గా ఫనికుమార్ బాధ్యతలకు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాసులు గౌడ్ తిరుపతికి బదిలీపై వెళ్లారు. దీంతో అనంతపురం జిల్లా నుంచి వచ్చిన ఈ.ఫణికుమార్ బాధ్యతలు చేపట్టారు. అలాగే ఎంపీడీఓగా భాగ్యలక్ష్మిని నియమించారు. వైఎస్సార్ కపడ జిల్లాలో పనిచేస్తున్న ఆమెను పాణ్యం ఎంపీడీఓగా అధికారులు నియమించారు.

### పాణ్యంలో ఆరోగ్య వైద్య శిబిరం

పాణ్యం: జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సీహెచ్‌సీ డాక్టర్ రోహాలాతో పాటు పలువురు డాక్టర్లు పాల్గొని దాదాపు 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు, కంటి అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మేకల పల్లవి, ఈఓఆర్డీ సులోచన, ఏఓ నరసింహారెడ్డి, ఈఓ బాలాంజనేయులు, డాక్టర్లు అభిషేక్, జగన్‌మోహన్ రెడ్డి, ఎంపీహెచ్‌ఈఓలు, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

# పేదల అభ్యున్నతికి కృషి


మహిళలకు గ్యాస్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: పేదల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నట్లు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం కింద అర్హులైన మహిళలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్‌తో పాటు సిలిండర్, స్టవ్, పైపును ఎమ్మెల్యే అందించారు. కల్లూరులోని ఆయన స్వగృహంలో జరిగిన పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు ఉజ్వల యోజన పథకం కింద ఉచిత గ్యాస్ కనెక్షన్ ఇస్తున్నట్లు చెప్పారు. దీనిని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని తనయుడు కాటసాని శివనరసింహారెడ్డి, కల్లూరు అర్బన్ జేసీఎస్ కన్వీనర్ ఇన్‌చార్జ్ హనుమంతురెడ్డి, రామాంజనేయులు, శివ తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న సురక్ష.. ప్రజల ఆరోగ్యానికి భద్రత


హెల్త్ క్యాంపులో కళ్లద్దాలను అందజేస్తున్న ఎంపీడీఓ

కోడుమూరు రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల ఆరోగ్యానికి భద్రత లభిస్తోందని ఇన్‌చార్జి ఎంపీడీఓ క్రిష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం కోడుమూరులోని గ్రామ సచివాలయం–5లో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపును ఆయన పరిశీలించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రతి ఇంటిని, కుటుంబాన్ని ఆరోగ్యంగా ఉంచాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ప్రజలంతా హెల్త్ క్యాంపులో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వైద్యులు శ్రీమంత్ మాదన్న, మదన్ శేఖర్, దివాకర్, నిరంజన్, ఎంపీహెచ్‌ఈఓ నరసప్ప, సూపర్‌వైజర్లు కమల్ సాహెబ్, ఉమాబాయి పాల్గొన్నారు.

## ఈకేవైసీ తప్పనిసరి


మాట్లాడుతున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్: రబీ పంటలను సాగు చేస్తున్న రైతులంతా ఆయా ఆర్‌బీకేల్లో ఈకేవైసీ చేయించుకోవాలని కోడుమూరు ఏఓ రవిప్రకాష్ అన్నారు. శుక్రవారం కోడుమూరు వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ సలహామండలి సభ్యులతో సమావేశం నిర్వహించారు. రబీ కింద రైతులు సాగు చేసిన ప్రతి పంటను నమోదు చేయించుకోవడంతో పాటు, ఈనెల 10వ తేదీలోగా ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు. పంట నమోదు, ఈకేవైసీ ఉంటేనే రైతులకు ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో ఏఈఓ తస్లీమ్, ఆర్‌బీకే సిబ్బంది రసూల్, విజయశాంతి, రైతులు పాల్గొన్నారు.

## త్వరితగతిన పింఛన్ల పంపిణీ


లద్దగిరిలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్


తిరుపాడులో వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న వలంటీరు ఉశేన్

కోడుమూరు రూరల్: మండలంలో త్వరితగతిన పింఛన్ల పంపిణీని పూర్తి చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ క్రిష్ణారెడ్డి ఆదేశించారు. శుక్రవారం పింఛన్ల పంపిణీపై ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో చర్చించారు. మండలంలో ఇప్పటి వరకు 9,190 పింఛన్లకు గాను 8,685 మందికి అందజేశారని, మిగిలిన పింఛన్లను కూడా ఈనెల 5వ తేదీలోగా లబ్ధిదారులకు అందజేసి ప్రభుత్వ లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు.

గడివేముల: పింఛన్ల పంపిణీ రెండో రోజు శుక్రవారం కొనసాగింది. వలంటీర్లు ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు చేశారు. వేలిముద్రలు సేకరించి పింఛన్ సొమ్మును అందజేశారు.

### మోడల్‌స్కూల్ విద్యార్థుల ప్రతిభ


రెండో స్థానంలో నిలిచిన జట్టుతో ప్రిన్సిపాల్

గడివేముల: ఆడుదాం ఆంధ్ర క్రీడాల్లో భాగంగా జిల్లా స్థాయిలో జరిగిన మహిళల కబడ్డీలో స్థానిక ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. గురువారం నంద్యాల పద్మావతి నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో రెండో స్థానంలో నిలిచారు. వీరందరూ బిలకలగూడూరు సచివాలయ పరిధికి చెందినవారు. జిల్లాస్థాయి పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులను ఏపీ మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ శైలజ, సింగిల్ విండో చైర్మన్ పోగుల చంద్రశేఖరరెడ్డిలు శుక్రవారం అభినందించారు.

### నగరి ఉత్సవాలకు జిల్లా కళాకారులు

కర్నూలు కల్చరల్: చిత్తూరు జిల్లా నగరిలో ఈనెల 5 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్న నగర ఉత్సవాల్లో జిల్లా కళాకారులు పాల్గొంటున్నారని ప్రభుత్వ శారదా సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపాల్ మునికుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర క్రీడా సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్‌కే రోజా ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాల్లో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలల విద్యార్థులు, ఆయా జిల్లాల్లో ప్రముఖంగా ఉన్న కళలకు సంబంధించిన కళాకారులు పాల్గొని ప్రదర్శనలు ఇస్తున్నారని తెలిపారు.

# ప్రజా సంక్షేమమే ధ్యేయం

- కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి
- పోలకల్–ముడుమాల రోడ్డు నిర్మాణానికి భూమి పూజ
- డాక్టర్ ఆదిమూలపు సతీష్‌తో కలిసి సిద్ధం పోస్టర్ల ఆవిష్కరణ


పోలకల్–ముడుమాల రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఆదిమూలపు సతీష్

సి.బెళగల్: ప్రజా సంక్షేమం, అభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం సి.బెళగల్ మండలం పోలకల్ గ్రామంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణ పనులకు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, ఎంపీపీ బొంతల మునెప్పతో కలిసి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. పోలకల్‌కు వచ్చిన నేతలకు నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ముందుగా గ్రామంలోని చెన్న సోమేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం పోలకల్ గ్రామం నుంచి ముడుమాల గ్రామం వరకు రూ.2.5 కోట్లతో నిర్మించనున్న ఆర్‌అండ్‌బీ రోడ్డు పనులను ప్రారంభించారు. కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయని, అదేవిధంగా సంక్షేమ పథకాలు అర్హులైన వారి ఇళ్లకే చేరుతున్నాయని తెలిపారు. డాక్టర్ ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ.. రోడ్డు నిర్మాణ పనులు నెలలోగా పూర్తి అవుతాయని, పోలకల్, ముడుమాల గ్రామాల రోడ్డుతో నదీతీర గ్రామాల ప్రజలకు మండల కేంద్రాలు సి.బెళగల్, గూడూరులకు వచ్చేందుకు సులువుగా ఉంటుందన్నారు.

**మరోసారి గెలుపించుకుందాం**

కోడుమూరు నియోజకవర్గంలో ముచ్చటగా మూడోసారి వైఎస్సార్‌సీపీని గెలుపించుకునేందుకు మండల నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు కృషి చేయాలని నియోజకవర్గ సమన్వయకర్త, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. పోలకల్ గ్రామంలోని ఎంపీపీ బొంతల మునెప్ప ఇంటి ఆవరణలో ఆదిమూలపు సతీష్తో కలిసి ''సిద్ధం'' పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రభుత్వం ప్రజలకు అందించిన పథకాలను ప్రతి ఒక్కరికీ తెలియజేయాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరు సమన్వయంతో పని చేయాలని సూచించారు. డాక్టర్ ఆదిములపు సతీష్ మాట్లాడుతూ.. కుడా చైర్మన్, తాను స్థానికంగా ఉంటూ ప్రజలకు, కార్యకర్తలకు, నాయకులకు అందుబాటులో ఉంటామని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో పార్టీని గెలిపించి కోడుమూరు వైఎస్సార్‌సీపీ అడ్డ అనే విషయాన్ని మరోసారి గట్టిగా చాటాలని కోరారు. అనంతపురంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరుకానున్న ''సిద్ధం'' సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కర్నూలు జెడ్పీటీసీ ప్రసన్న, ఎంపీటీసీ సభ్యులు నడిపి సోమన్న, మణిమోహన్‌రెడ్డి, సర్పంచ్‌లు దస్తగిరి, ఇమ్మానియేల్, పాండురంగన్న, నాయకులు పులిరాజు, నరసింహుడు, నాగేశ్వరరెడ్డి, రంగారెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.


పోలకల్‌లో సిద్ధం పోస్టర్ల ఆవిష్కరణ

### సన్మానం



తహసీల్దార్ శ్రీనివాసులును సన్మానిస్తున్న దృశ్యం

గడివేముల: సార్వత్రిక ఎన్నికలలో భాగంగా చిత్తూరు జిల్లాకు బదిలీ అయిన తహసీల్దార్ శ్రీనివాసులును ప్రజాప్రతినిధులు, సిబ్బంది శుక్రవారం ఘనంగా సన్మానించారు. తహసీల్దార్‌గా ఏడాదిన్నర పాటు సేవలు అందించారని పలువురు కొనియాడారు. జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖర రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ గురునాథ్, సర్వేయర్ శివ, ఆర్ఐ వెంకటసుబ్బయ్య, వీఆర్వోలు, సింగిల్‌విండో చైర్మన్ పోగుల చంద్రశేఖరరెడ్డి, ఉప సర్పంచ్ బాలచెన్ని తదితరులు పాల్గొన్నారు.

### హౌసింగ్ డీఈఈ పర్యటన

గూడూరు: పట్టణంలో హౌసింగ్ డీఈఈ వాసుదేవ రావ్ శుక్రవారం పర్యటించారు. జగనన్న హౌసింగ్ కాలనీల్లో పర్యటించి లబ్ధిదారులతో మాట్లాడారు. త్వరితగతిన గృహనిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక హౌసింగ్ కార్యాలయాన్ని సందర్శించారు.

### బాస్కెట్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపిక


జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు హర్షద్‌బాషా, హాసిని

కర్నూలు (టౌన్): జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు జిల్లాకు చెందిన క్రీడాకారులు ఎంపికయ్యారు. గత జూన్ నెల 28 నుంచి 30 వరకు ఏలూరులోని నూజివీడులో నిర్వహించిన 8 వ రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొన్న కర్నూలు క్రీడాకారులు హర్షద్‌బాషా (పురుషుల విభాగం మ) కె. హాసిని (బాలికల విభాగం) అత్యుత్తమ ప్రదర్శన చేసి జిల్లా జట్టు గెలుపునకు కృషి చేశారు. దీంతో గత నెల జనవరి 19 వ తేదీ నుంచి ఈనెల 2 వరకు నిర్వహించిన జాతీయ స్థాయి కోచింగ్ క్యాంపులో పాల్గొని ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపికయ్యారు. ఈనెల 4 నుంచి 11 వ తేదీ వరకు ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో జరిగే జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటున్న నేపథ్యంలో వారిని జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి భాను ప్రసాద్, అధ్యక్షురాలు నీలిమ ప్రత్యేకంగా అభినందించారు.

# చిత్తడి నేలలను సంరక్షించుకోవాలి


గార్గేయపురం చెరువు పరిసరాలను శుభ్రం చేస్తున్న అటవీ ఉద్యోగులు

కర్నూలు కల్చరల్: అటవీ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కర్నూలు సిటీ ఫారెస్ట్ వద్ద వరల్డ్ వెట్‌ల్యాండ్ డేను నిర్వహించారు. అటవీ శాఖ ఉద్యోగులు గార్గేయపురం చెరువు పరిసరాల్లో శుభ్రం చేశారు. ప్లాస్టిక్ కవర్లు, బ్యాటిళ్లు, చెత్తా చెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా కర్నూలు ఎఫ్ఆర్ఓ రమణారెడ్డి మాట్లాడుతూ చిత్తడి నేలలను సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అటవీ భూముల పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో వన సంరక్షణ సమితి అధ్యక్షురాలు వెంకటేశ్వరమ్మ, బీట్ ఆఫీసర్లు నగేష్, రేణుక, రామచంద్రుడు, కాళిదాసు, తదితరులు పాల్గొన్నారు.

### కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు శుక్రవారం 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు. డ్యాంలో ప్రస్తుతం 0.418 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.


### కర్నూలు ఎంపీడీఓగా నరసింహనాయుడు

కర్నూలు (సిటీ): కర్నూలు రూరల్ ఎంపీడీఓగా నరసింహనాయుడును నియమించారు. ఈ మేరకు శుక్రవారం జెడ్పీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణ ఎన్నికల్లో భాగంగా అనంతపురం జిల్లా లేపాక్షి మండలం నుంచి ఆయన్ను కర్నూలు మండలానికి బదిలీ చేశారు.

### ప్రజా వ్యతిరేక బడ్జెట్

కర్నూలు(సెంట్రల్): కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన ఓటాన్ బడ్జెట్ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేకమైనదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు శుక్రవారం ప్రకటనలో విమర్శించారు. జిల్లాకు సంబంధించి రైల్వే వ్యాగ న్ కోచ్ వర్కు షాపునకు కేవలం రూ.115కోట్లు కేటాయించడం అన్యాయమన్నారు.

### సిద్ధా ఆయుర్వేదం ఆరోగ్యానికి మంచిది



స్టేడియానికి చేరుకున్న సిద్ధా ఆయుర్వేద ర్యాలీ

కర్నూలు (టౌన్) : సిద్ధా ఆయుర్వేదం ఆరోగ్యానికి ఎంతో మంచిదని జిల్లా క్రీడాలభివృద్ధి అధికారి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో సిద్ధా ఆయుర్వేదంపై కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ రెండు వేల కిలోమీటర్లు పూర్తి చేసుకుంది. శుక్రవారం కర్నూలుకు చేరుకున్న ఈ ర్యాలీని డీఎస్‌డీఓ శ్రీనివాసరావు, రాష్ట్ర యోగా సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి, ఆయుష్ మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్‌రెడ్డి స్వాగతం పలికి మాట్లాడారు. అనంతరం సిద్ధా ఆయుర్వేద కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయుష్ మెడికల్ ఆఫీసర్ ప్రభాకర్ రెడ్డి, సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసర్చ్ ఇన్ సిద్ధా డాక్టర్ రాజేంద్రకుమార్, నిర్వాహకులు డాక్టర్ సురేష్, ట్రాఫిక్ కంట్రోల్ ఎయిర్ పోర్టు అథారిటీ అధికారి బెంజిమన్ పాల్గొన్నారు.